పెద్ద చెరువును చెరబట్టారు..!

పరిగి చెరువులో ఆక్రమణలు

● పట్టించుకోని అధికారులు ● భవనాలు కట్టేస్తున్న ఆక్రమణదారులు



చెరువును పూడ్చుతున్న దృశ్యం

పరిగి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో అతి పెద్ద చెరువుల్లో ఒకటైన పరిగి చెరువు దినదినానికీ కుంచించుకుపోతోంది. కబ్జాకోరల్లో చిక్కుకుంది. యథేచ్ఛగా ఆక్రమిస్తూ ఏకంగా భవనాలే నిర్మిస్తున్నారు. సుమారు 400 సంవత్సరాల క్రితం చోళరాజులు వెయ్యి ఎకరాల్లో చెరువు తవ్వారు. 30ఏళ్ల క్రితం వర్షాలులేక ఎండిపోయింది. వేరే ప్రాంతాల నుంచి పరిగికి వలస వచ్చి అప్పట్లో గుడిసెలు నిర్మించుకుని క్రమక్రమంగా శాశ్వత భవనాలు నిర్మించుకున్నారు. దీంతో దాదాపు 200 ఎకరాల వరకు చెరువుప్రాంతంలో భవనాలు వెలిశాయి. వాటిని తొలగించాలని ప్రజా సంఘాల నేతలు.. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలే దు. సుమారు టీఎంసీ నీటి నిల్వతో చెరువు కళకళలాడుతుండేది. చెరువు కింద 5వేల ఎకరాల ఆయకట్టు ఉంది. దానిపై ఆధారపడి 3వేల మంది రైతులు జీవనం సాగిస్తున్నారు. వరి, రాగి, మొక్కజొన్న, మిరప పంటలు సాగు చేస్తున్నారు. మత్స్యకారులు చెరువులో చేపల పెంపకం చేపడుతున్నారు. కొంతమంది కబ్జాదారులు స్వలాభం కోసం చెరువు ప్రాంతాన్ని పూడ్చుతూ వ్యాపారాల కోసం భవనాలు ఏర్పాటు చేసుకున్నారు. పలుమార్లు చెరువు ఆక్రమణపై మీడియాలో కథనాలు వచ్చినా.. అధికారులు కాగితాల ప్రక్రియతో సరిపెడుతున్నారు తప్ప.. చెరువును కాపాడే ప్రయత్నాలు చేయట్లేదన్న విమర్శలున్నాయి. ఆక్రమణలు ఇలాగే కొనసాగితే చెరువు కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఇతర ప్రాంతాలకు చెందినవారు చెరువు ప్రాంతాన్ని ఆక్రమించుకుని, వ్యాపారం చేస్తున్నారు. ఇక్కడ పరిగికి సంబంధించిన ఆధార్‌కార్డులు లేకపోయినా కొంతమంది నాయకుల అండదండలతో చెరువు ప్రాంతాన్ని ఆక్రమించుకుని, వ్యాపారం చేస్తున్నారు. ఇలాంటి కబ్జాలకు పాల్పడుతున్నవారి భవనాలకు ఇంటి, నీటి పన్ను, విద్యుత్‌బిల్లు, వసూలు చేస్తున్నారు. దీంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. చెరువులో చేపల పెంపకంపై ఆధారపడిన మత్స్యకారులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆక్రమణదారులను అడ్డుకుంటున్న గ్రామస్థులు



చెరువు కనుమరుగవుతుందేమో..

కబ్జాలు ఇలాగే కొనసాగితే పరిగి చెరువు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. చెరువు నీటిపై ఆధారపడిన రైతులు, మత్స్యకారులు జీవనాధారం కోల్పోతున్నారు. కొందరు స్వలాభం కోసం చెరువును పూడ్చి, వ్యాపారాలు సాగిస్తున్నారు.

-వేణు, మత్స్యకారుడు



కబ్జాదారులను శిక్షించాలి

చెరువు ప్రాంతంలో కబ్జాచేసి, భవనాలు నిర్మించిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. భవనాలను పరిశీలించి, కబ్జాదారులను శిక్షించాలి.

-రాందాసు, రైతు

చర్యలు తీసుకుంటాం

చెరువును ఆక్రమించిన వారికి పలుమార్లు నోటీసులు జారీచేసి, హెచ్చరించాం. వారి తీరు మారడంలేదు. ఆక్రమణలపై నివేదిక తయారుచేసి, ఉన్నతాధికారులకు సమర్పిస్తాం. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం.

-సిద్దేశ్, ఆర్ఐ

రచ్చబండ

● వైసీపీ పురం ఇన్‌చార్జ్ దీపికకు కొండూరులో అసమ్మతి సెగ



దీపిక కారును అడ్డుకున్న వైసీపీ నాయకులు

లేపాక్షి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీలో వర్గ విభేదాలతో రచ్చ తారస్థాయికి చేరింది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దీపిక ఏర్పాటు చేసిన సమావేశాన్ని సొంతపార్టీ నాయకులే బుధవారం అడ్డుకోవడం ఇందుకు చక్కని ఉదాహరణ. మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ ఆత్మీయ సమావేశం నిర్వహించి గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలని వైసీపీ అధిష్టానం ఆదేశించింది. ఆమేరకు హిందూపురం వైసీపీ ఇన్‌చార్జ్ దీపిక బుధవారం కొండూరు గ్రామంలో రచ్చబండ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతుండగా అడ్డుతగిలిన అసమ్మతి నాయకులు తమ గ్రామంలో సమాచారం ఇవ్వకుండా సమావేశాలు ఏర్పాటు చేయరాదని వేదిక వద్దకు దూసుకువచ్చారు. ఆమె అనుచరులు అడ్డుకుని సమాచారం ముందే ఇచ్చామని వాగ్వాదానికి దిగారు. పార్టీ కోసం కష్టపడిన తమకు కనీస సమాచారం ఇవ్వకుండా సమావేశాలు, గ్రామ కమిటీలను ఏర్పాటుచేస్తే సహించేది లేదని అసమ్మతినాయకులు హెచ్చరించారు. దీంతో పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని కార్యక్రమాన్ని వాయిదా వేసి వెనుతిరిగారు. ఆ సమయంలో ఆమె వాహనాన్ని అడ్డుకుని పలువురు నినాదాలు చేశారు. అడ్డుకున్నవారిలో జడ్పీటీసీ బాణాల శ్రీనివాసరెడ్డి, వైసీపీ మాజీ మండల కన్వీనర్ నారాయణస్వామి, వైసీపీ ఎంపీటీసీ అశ్వత్థ తదితరులు ఉన్నారు.

ఐక్య పోరాటాలే ఐద్వా బలం

● పీడిత ప్రజల పక్షాన పోరు సాగించాలి
● ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి టీచర్
● ముగిసిన ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలు





ప్రసంగిస్తున్న ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి టీచర్, భావోద్వేగంతో కంటతడి పెట్టిన రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శి సావిత్రి

అనంతపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పీడిత ప్రజలను ఐక్యం చేసి పోరాటం చేయడమే ఐద్వా బలమవ్వాలని ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి టీచర్ అన్నారు. నగరంలో ఈ నెల 13 నుంచి నిర్వహిస్తున్న ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలు బుధవారం ముగిశాయి. మహిళా సమస్యలపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించారు. ముగింపు కార్యక్రమంలో శ్రీమతి టీచర్ ప్రసంగించారు. దేశంలోని మహిళలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. వేతనాల్లో వివక్ష కొనసాగుతోందని, మహిళలపై హింస పెరుగుతోందని అన్నారు. ప్రభుత్వ విధానాలకు మతతత్వ పార్టీలు తోడవడంతో మహిళల హక్కులు (మిగతా 9వ పేజీలో...)

ఉపాధ్యాయుల కొరతను తీర్చండి

● డీఈఓకు ఎస్టీయూ నాయకుల వినతి



డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

కొత్తచెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో డీఈఓ క్రిష్టప్పకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పాఠశాలల్లో ఎస్‌జీటీ, లాంగ్వేజ్ పండిట్లు, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో హిందీ సబ్జెక్టు టీచర్ల కొరత ఉందని వివరించారు. ఉపాధ్యాయులపై ఉన్న పెండింగ్ విచారణలను త్వరగా పూర్తి చేయాలని కోరారు. పదో తరగతి మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రావాల్సిన టీఏ, డీఏలను వెంటనే వారి ఖాతాల్లో జమచేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు వెంకటేశ్వర్లు, శివయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

భర్త, పనిమనిషిని కిడ్నాప్ చేసిన భార్య

● తిరుచానూరుకు వెళ్లి రక్షించిన పోలీసులు

కదిరి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): భార్య అపహరించిన భర్తను, ఆ ఇంటి పనిమనిషిని పోలీసులు రక్షించారు. కదిరి పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన మేరకు, కదిరి ఎన్‌జీవో కాలనీకి చెందిన ప్రవీణ్‌ను, ఆ ఇంటి పనిమనిషి చైతన్యను అయన భార్య మంజుల ఈ నెల 13న అపహరించారు. తిరుపతి జిల్లా తిరుచానూరులో మంజుల కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. అక్కడి నుంచి రెండు కార్లలో సుమారు 18 మందితో కలిసి కదిరికి వచ్చిన మంజుల, తన భర్తను, పనిమనిషిని బలవంతంగా వాహనాల్లో తీసుకెళ్లారు. అడ్డువచ్చిన ప్రవీణ్ తల్లిదండ్రులను చితకబాదారు. దీంతో ప్రవీణ్ తల్లి వెంకటరమణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన కదిరి పోలీసులు, కిడ్నాప్ అయిన ఇద్దరినీ రక్షించారు. ఈ నెల 14న కదిరికి తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కదిరి మండలం కాలసముద్రం రైల్వేస్టేషన్‌లో పాయింట్స్‌మన్‌గా పనిచేస్తున్న ప్రవీణ్‌తో మంజులకు ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. దంపతుల మధ్య కొంతకాలంగా మనస్పర్థలు కొనసాగుతున్నాయి. ప్రవీణ్‌కు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఆయన భార్య అపహరించారని సమాచారం. మహిళా కానిస్టేబుల్‌పై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

అద్దె అడగొద్దు 9

● బీఎస్ఎన్ఎల్ భవనంలో జేసీ క్యాంపు కార్యాలయం ● నెలకు రూ.70 వేలు అద్దె ● పైసా కూడా చెల్లించని దుస్థితి ● రూ.30 లక్షలు బకాయి



రాజారెడ్డి ఎక్కడ?

పట్టుకుని.. వదిలేసిన పోలీసులు..? 9

9 జడ్పీ ఆవరణలో ఉత్కంఠ

ఏసీబీ తనిఖీలతో ఉద్యోగుల్లో ఆందోళన

బొలెరో వాహనంపై పడ్డ కంటైనర్

● ముగ్గురికి తీవ్రగాయాలు



బొలెరో వాహనంపై పడిన కంటైనర్

తనకల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీజీ ప్రాజెక్టు గ్రామంలో బుధవారం బొలెరో వాహనంపై కంటైనర్ అదుపుతప్పి పడింది. ప్రమాదంలో బొలెరో వాహన డ్రైవర్ రెడ్డిశేఖర్, దండువారిపల్లి వాసి మహాదేవ, సీజీ ప్రాజెక్టుకు చెందిన అమిత్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దండువారిపల్లికి చెందిన రెడ్డిశేఖర్, మహాదేవ బొలెరో వాహనంలో వచ్చి సీజీ ప్రాజెక్టు గాలి పట్టించుకున్నారు. ఇంతలో కియ పరిశ్రమ నుంచి చెన్నై వెళ్లడానికి కంటైనర్ వచ్చింది. సీజీ ప్రాజెక్టు మలుపులో అదుపుతప్పి గాలిపట్టించుకుంటున్న బొలెరో వాహనంపై పడింది. దీంతో వాహనంలో ఉన్న డ్రైవర్ రెడ్డిశేఖర్, మహాదేవ ఇరుక్కుపోయారు. పక్కనే ఉన్న అమీర్ గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, వందేమాతరం టీం ప్రమాద స్థలానికి చేరుకుని, బొలెరోలో ఇరుక్కున్న వారిని బయటకు తీసి తనకల్లు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కదిరికి తీసుకెళ్లారు.

ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన జర్మన్ బృందం

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెడబల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రైతులు సాగుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను బుధవారం జర్మన్ బృందం పరిశీలించింది. జర్మన్ అంబాసిడార్ ఫిలిప్పీ అకర్మన్ బృందం వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ జర్మన్ ప్రతినిధులతో కలిసి పంటలను పరిశీలించారు. పెడబల్లి తండాకు చెందిన రైతు ఆంజనేయులు నాయక్ పొలంలో జీవామృతాల తయారీ విధానాలను సంబంధిత అధికారి లక్ష్మానాయక్ వివరించారు. అనంతరం పీఎండీఎస్ ద్వారా సాగుచేసిన పంటను పరిశీలించి, రైతుతో మాట్లాడారు. రైతు విజయభాయ్ సాగుచేస్తున్న వేరుశనగ, సుధాకర్‌రెడ్డి సాగుచేస్తున్న వరి పంటలను పరిశీలించి మహిళా సంఘ సభ్యులతో ప్రకృతి వ్యవసాయ విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్పెషల్ సీఎస్ రాజశేఖర్ మాట్లాడుతూ.. రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటిస్తూ మంచి ఫలితాలను పొందాలని సూచించారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ స్టేట్ టీం మురళీధర్, వరప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామునాయక్, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ విధానాన్ని పరిశీలిస్తున్న జర్మన్ బృందం, అధికారులు

జడ్పీలో సందడి..!

● ఉద్యోగోన్నతికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ● ఏసీఆర్ సమర్పణకు సీనియర్ అసిస్టెంట్ల క్యూ (వివరాలు 9వ పేజీలో..)

ఆటోలో ప్రసవించిన మహిళ

● శిశువు మృతి

తనకల్లు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గేమేనాయక్ తండాకు చెందిన శారద అనే గర్భిణి ఆటోలో ప్రసవించారు. శిశువు మృతిచెందటంతో ఆమె కన్నీరు మున్నీరయ్యారు. శారదకు బుధవారం రాత్రి పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేందుకు 108కు ఫోన్ చేశారు. కానీ తనకల్లులో 108 వాహనం అందుబాటులో లేదు. కదిరి నుంచి వాహనం రావాల్సి ఉండటంతో కుటుంబ సభ్యులు ఆమెను ఆటోలో తీసుకుని తనకల్లుకు బయలుదేరారు. నొప్పులు ఎక్కువై ఆమె మార్గమధ్యంలో, ఆటోలోనే ప్రసవించారు. పురిటి బిడ్డ మృతి చెందాడు. కాసేపటికి అక్కడికి చేరుకున్న 108 వాహనం, బాలింతను తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. అమె చికిత్స పొందుతున్నారు.

తొలగుతున్న అడ్డంకులు

● వేగంగా హంద్రీనీవా మరమ్మతులు
● రూ.1.32 కోట్లతో పూడిక, ముళ్లకంపల తొలగింపు పనులు
● మడకశిర ప్రాంత చెరువులకు చేరుతున్న కృష్ణా జలాలు



మణూరు చెరువుకు చేరిన కృష్ణా జలాలు



గుడిబండ వద్ద హంద్రీనీవా కాలువలో కంప చెట్లు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

మడకశిర, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువల మరమ్మతు పనులు నియోజవర్గంలో వేగంగా జరుగుతున్నాయి. నియోజకర్గంలో 88 కిలోమీటర్ల హంద్రీనీవా కాలువలో ముళ్ల కంపలు, పూడికతీత, మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం 1.32 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఇప్పటికే మడకశిర మండలంలో కాలువల మరమ్మతులు చేపట్టారు. గుడిబండ, అమరాపురం మండలంలో ముళ్ల కంపలు, పూడిక తొలగించే పనులు వేగంగా జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నేరుగా కృష్ణాజలాలు మడకశిర ప్రాంతంలోని చెరువులకు నీరు చేరుతున్నాయి. మడకశిర మండలంలోని మణూరు చెరువుకు కృష్ణా జలాలు చేరుతుండటంతో మరో రెండు రోజుల్లో నిండే అవకాశం ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. మణూరు చెరువు నిండిన తరువాత, మడకశిర, గుడిబండ, అమరాపురం మండలంలోని చెరువులకు కృష్ణాజలాలు చేరనున్నాయి.

పెరగనున్న సాగు విస్తీర్ణం

తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నియోజకవర్గంలో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. దీంతో ప్రజలు తాగునీటికే తీవ్ర ఇబ్బందులు పడేవారు. రైతులు వర్షాధారంగా వ్యవసాయాన్ని కొనసాగించారు. వానొస్తే పంట పండుతుంది లేదంటే ఎండుతుంది అనేలా పరిస్థితి ఉంది. వరుస కరువులతో ప్రతి ఏటా సాగు విస్తీర్ణం తగ్గిపోతూ వస్తోంది. అయితే ప్రస్తుతం కృష్ణాజలాలను మడకశిర ప్రాంతంలోని చెరువులకు తరలిస్తుండటంతో రైతుల్లో సాగు ఆశలు చిగురిస్తున్నాయి. భూగర్భ జలాలు పెరిగితే తాగు, సాగు నీటి సమస్య తీరుతుందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు బీళ్లుగా ఉన్న భూములు సైతం సాగులోకి వస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రూ.1.32 కోట్లతో మరమ్మతులు

హంద్రీనీవా కాలువలో పూడిక, కంపచెట్లు తొలగించేందుకు, ఇతర మరమ్మతులకు ప్రభుత్వం రూ.1.32 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో 88 కిలోమీటర్ల కాలువను శుభ్రం చేస్తాం. ప్రస్తుతం మణూరు చెరువుకు కృష్ణాజలాలు వస్తున్నాయి. మరో రెండు రోజుల్లో చెరువు మరువ పారుతుంది. తర్వాత మిగిలిన చెరువులకు నీరు విడుదల చేస్తాం.

-నాగార్జున, ఏఈ, హెచ్ఎన్ఎస్ఎస్

న్యూస్ బాక్స్

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం: ఎంపీడీఓ



బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న అధికారులు

అమడగూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పరసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ మునెప్ప పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలపరిధిలోని జౌకలకొత్తపల్లిలో హెల్త్‌సెంటర్ చుట్టూ పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి, నీటి ట్యాంక్ వద్ద శుభ్రం చేయించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లి క్లోరినేషన్ చేశారు. పొడి, తడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికుల తోపుడుబండిలో వేయాలని ఎంపీడీఓ గ్రామస్థులకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలడంతో తప్పనిసరిగా వేడిచేసిన నీళ్లను త్రాగాలని పేర్కొన్నారు. గ్రామంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యాదర్శి సుఫియా, సిబ్బంది సరస్వతి,శాంతి, శ్యామ్, ఆరోగ్య సిబ్బంది, ఏఎస్ఎం షమ్‌షూన్, భిక్షవతి, ఆశలు తదితరుల పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ధర్మవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సీపీఆర్(హృదయ శ్వాస కోశ పునరుజ్జీవ చర్య)పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎవరికైనా ఉన్నఫలంగా గుండెపోటు వస్తే సీపీఆర్ ఎలా చేయాలన్న అంశంపై రెడ్ క్రాస్‌సొసైటీ ప్రతినిధి డాక్టర్ షాహీద్, జిల్లాకో ఆర్డీనేటర్ రమేశ్ ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. దేశవ్యాప్తంగా ఈనెల 13 నుంచి 17వరకు సీపీఆర్ అవేర్నెస్ వీక్‌ను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున, అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లాలో ఐటీ సంస్థలు ఏర్పాటు చేయాలి

● టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫి

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో అత్యంత వెనుకబడిన శ్రీసత్యసాయి జిల్లాలో ఐటీ సంస్థలను ఏర్పా టుచేసి నిరుద్యోగ యువతీ యువకులను ఆదుకోవాలని టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫి రాష్ట్ర ప్రభుత్వా న్ని కోరారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ... విశాఖపట్టణంలో గూగుల్ సంస్థ తన కార్యాలయాన్ని ప్రారంభించ డంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కృషి ఎనలేనిదన్నారు. జిల్లాలోనూ ఐటీ సంస్థలు ఏర్పాటుచేస్తే వలసలు తగ్గి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. సత్యసాయి జిల్లా కేంద్రంలో ఉన్న మౌలిక వసతులు ఐటీ రంగ సంస్థలకు అనుకూలంగా ఉన్నాయ న్నారు. బెంగళూరు నగరం పుట్టపర్తికి అందుబాటులో ఉందని, గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంతో ఈ ప్రాంతంలో ఐటీ సంస్థల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందన్నారు.

గ్రంథాలయానికి ఫ్యాన్, ట్యూబ్ లైట్ల వితరణ



గ్రంథాలయాధికారికి ఫ్యాన్,ట్యూబ్‌లైట్లు అందజేస్తున్న దాతలు

కొత్తచెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శాఖ గ్రంథాలయానికి ఒక ఫ్యాను, పది ట్యూబ్‌లైట్లను ఎల్‌అండ్‌టీ శ్రీకాంత్, విశ్రాంత హెచ్‌ఎం ప్రసాద్, గాజుల చంద్ర, వీరశేఖర్ కలిసి అందజేసినట్లు గ్రంథాలయాధికారి రమేశ్‌నాయక్ తెలిపారు. గ్రంథాలయానికి మరికొందరు దాతలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దివ్యతేజ, పాఠకులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ధర్మవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన చేనేత కార్మికురాలు అన్నం రాజేశ్వరి(33) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఐటీడీపీ సభ్యులు ఆనందరెడ్డి, టీడీపీ నాయకులు సంధారాఘవకు విషయం తెలియజేశారు. ఆయన రూ.10వేలు సమకూర్చగా, ఆ మొత్తాన్ని మృతురాలి కుటుంబస భ్యులకు టీడీపీ నాయకులు హరిప్రసాద్, తోట వాసుదేవరాయల్, వార్డు నాయకులు తిరుపాలు, రామచంద్ర బుధవారం అందజేశారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ



అమడగూరులో శిక్షణ ఇస్తున్న ఉపగణాంక అధికారి

అమడగూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ కార్యాలయంలో బుధవారం పంటకోత ప్రయోగాలపై వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉపగణాంక అధికారి శ్రీనివాసులు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పంట కోత ప్రయోగాల ప్రాముఖ్యత, ఆవశ్యకతను తెలిపారు. ప్రధానమంతి ఫసల్ బీమా యోజన కింద గ్రామ యూనిట్‌గా కందిపంటను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఏఎస్ఓ నరేంద్ర, ఏఓ వెంకటరమణాచారి, ఏఈఓ రమేష్‌నాయక్, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

● నల్లమాడ: మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్‌హాక్ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి పంటకోత ప్రయోగాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి, కంది, వేరుశనగ, రాగి, తదితర సాగుచేసిన పంటలను ఏ విధంగా పంట కోత ప్రయోగాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ శ్రీనివాసులు నాయక్, ఏయస్ఓ హర్షవర్ధన్‌రెడ్డి, ఏఓ అబ్దుల్ హాక్, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వాన నీరు కాదు.. మురుగునీరే..!

● రోడ్డుపై పారుతున్నా పట్టించుకోని పంచాయతీ అధికారులు
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



గంగమ్మగుడి వద్ద సీసీ రోడ్డుపై పారుతున్న మురుగునీరు

కొత్తచెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేణుగోపాల్‌నగర్ 40 అడుగుల రహదారిపై చేరిన ఈ నీరు వర్షపునీరు అనుకుంటే పొరబడినట్టే. రహదారిలో మురుగునీరు చేరి నిల్వ ఉండడంతో చిన్నపాటి మడుగును తలపిస్తోంది. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటే ఇబ్బంది పడుతున్నామని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. మురుగునీరు రహదారిపై నిలబడడంతో వాహనదారులు, పాదాచారులు, చిన్నారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగు నీరంతా రహదారులపై ప్రవహిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రహదారిలోని గంతల్లో ము రుగు నీరు నిలుస్తోందని తెలిపారు. దాని నుంచి దుర్వాసనతో ఇళ్లల్లో ఉండ లేకపోతున్నామని కాలనీ వాసులు చెబుతున్నారు. ఎవరికైనా జబ్బు చేసినప్పుడు అత్యవసరంగా ఆసుపత్రికి తీసువెళ్లాలంటే ఆటో లు, 108 వాహనం వచ్చేందుకు కూడా వీలు లేకుండా ఉందన్నారు. ఈ ప్రాంతంలో సీసీ రోడ్డుతో పాటు డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు ఎన్నో మార్లు తెలిపినా పట్టించుకోలేదన్నారు. అదే విదంగా బీసీ కాలనీలోని గంగమ్మ గుడివీధిలోను, కుమ్మర కాలనీలోని వీధుల్లో మురుగునీటి ప్రవాహం చిన్న పాటి కాలువలను తలపిస్తున్నాయి. దీంతో ఆ రోడ్లపై వెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాహన దారులు, పాదాచారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలు ఏర్పాటుచేయాలని వారు కోరుతున్నారు.

అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం

● ఎమ్మెల్యే కందికుంట ● అధికారులతో సమీక్ష



ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

కదిరి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. నియోజవర్గంలో చేపట్టిన, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై ఆయన బుధవారం పట్టణంలోని అర్ అండ్ బీ బంగ్లాలో వివిధ శాఖల అధికారులు, ఇంజనీర్ల తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు, ఇంజనీర్ల సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా హంద్రీనీవా కాలువ ద్వారా నియోజకవర్గంలో 33 చెరువులకు నీళ్లు అందిస్తున్నట్లు తెలియ జే శారు. తద్వారా ఇప్పటికే 22 చెరువులు నిండాయని అన్నారు. పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా కదిరి, నల్లచెరువు, తనకల్లు మండలాల్లోని చెరువులను నింపినట్లు తెలిపారు. అదే విధంగా మెయిన్ బ్రాంచ్ కెనాల్ ద్వారా తలుపుల మండలంలోని కొండారెడ్డి చెరువు నిండిందని, మిగిలిన చెరువులకు నీరు వెళుతున్నట్లు వివరించారు. హంద్రీనీవా నీరు గాండ్లపెంట మండలానికి నీళ్లు వెళ్లే విధంగా పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఆ మండలంలో చెరువులకు నీరు అందించనున్నట్లు వివరించారు. ఇందుకు కోసం రూ.46 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. గాండ్లపెంట, నల్లచెరువు, కదిరి, నంబులపూలకుంట మండలాల్లో మరో 25 చెరువులకు నీరు ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా విద్యుత్, హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

● న్యాయవాదుల డిమాండ్ ● విధుల బహిష్కరణ



ధర్మవరంలో విధులను బహిష్కరించిన న్యాయవాదులు

ధర్మవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): హైకోర్టు బెంచ్‌ను కర్నూల్‌లో ఏర్పాటుచేయాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం స్థానిక కోర్టు ఆవరణంలో నిరసన చేపట్టారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు విదులను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు కరీం, ప్రధాన కార్యదర్శి డీఎల్ఎన్ మూర్తి, ఉపాధ్యక్షుడు నూర్ మహమ్మద్ మాట్లాడుతూ... హైకోర్టు బెంచ్‌ను కర్నూల్‌లో ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేశారు. హైకోర్టు బెంచ్‌ను రాయలసీమలో ఏర్పాటు చేయాలని కొన్నేళ్లగా న్యాయవాదులు పలు మార్లు ఉద్యమాలు, నిరసనలు, నిరాహారదీక్షలు చేపట్టినా ప్రభుత్వాలు స్పందించలేదన్నారు. రాయలసీమ ప్రాంతవాసులు హైకోర్టుకు వెళ్లాలంటే చాలాదూరంలో ఉన్న విజయవాడ కు వెళ్లాల్సివ స్తోందన్నారు. రాయలసీమ అభివృద్ధికి, రాయలసీమ వాసులకు అనుగుణంగా హైకోర్టు బెంచ్‌ను కర్నూలులో ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించక పోతే నిరాహారదీక్షలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు.

● కదిరిలీగల్: రాయలసీమలో హైకోర్టు ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో కదిరి న్యాయవాదులు బుధవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. విధుల బహిష్కరణ బుధవారం నుంచి ఈ నెల 18 వరకు కొనసాగుతుందని ఆ సంఘ అధ్యక్షుడు చౌడప్ప తెలిపారు. మొదట న్యాయవాదుల సంఘం కార్యాలయంలో సమావేశమైన న్యాయవాదులు నిరసన తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం తీర్మాన కాపీలను స్థానిక కోర్టుల న్యాయాధికారులకు అందించారు. అదే విధంగా కదిరి కేంద్రంగా ఏడీజే కోర్టు ఏర్పాటులో జరుగుతున్న జాప్యంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఒక వైపు రాజకీయంగా మరోవైపు న్యాయపరంగా పోరాటం చేసి ఏడీజే కోర్టును సాధించుకోవాలని తీర్మానం చేశారు. హైకోర్టు బెంచ్‌ను రాయలసీమలో ఏర్పాటు చేస్తే ఇక్కడి ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. సమావేశంలో న్యాయవాదుల సంఘం సభ్యులు రమేష్, సురేంద్ర, న్యాయవాదులు నాగశేషయ్య, సుబ్బరాజు గుప్త, ఏ కృష్ణమూర్తి, నాగేంద్రరెడ్డి, షాఅలీమియా తదితరులు పాల్గొన్నారు.



కదిరిలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌడప్ప

ఆటోను ఢీకొన్న లారీ

● ఏడుగురికి తీవ్రగాయాలు

బత్తలపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం సమీపంలో బుధవారం సాయంత్రం ఆటోను లారీ ఢీకొనడంతో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. బత్తలపల్లిలోని వడ్డెర కాలనీకి చెందిన 10 మంది కూలీలు బేల్దారి పనులకు ధర్మవరానికి వెళ్లారు. సాయంత్రం పనులు ముగించుకుని ఆటోలో తిరిగివస్తున్నారు. బత్తలపల్లి సమీపంలో డాబా వద్ద వెనుక వస్తున్న లారీ ఆ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న కూలీలు హనుమంతు, ఆంజనేయులు, అనిల్‌కుమార్, పెద్దన్న, రమాదేవి, వెంకటరాముడు, ఓబుళేశు తీవ్రంగా గాయప డ్డారు. మిగిలిన ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి వెళ్లి గాయప డిన వారిని పరిశీలించి సంఘటనపై ఆరాతీశారు. గాయపడిన వారిలో నలుగురు పెద్దన్న, హనుమంతు, ఓబుళేశు, రమాదేవి పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురానికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బాలికల అదృశ్యం కేసు ఛేదింపు

నల్లచెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ముగ్గురు బాలికల మంగళవారం అదృశ్యం కేసును ఛేదించి, వారిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మండలానికి చెందిన ముగ్గురు బాలికలు మండలంలోని ఓ పాఠశాలలో చదువుతున్నారు. వారు రోజూ లాగే మంగళవారం ఉదయం ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లారు. సాయంత్రం పాఠశాల సమయం ముగియగానే వారు తమ ఇళ్లకు వెళ్లారు. అనంతరం రోజులాగే ట్యూషన్‌కు వెళ్తున్నామని తల్లిదండ్రులకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరారు. అయితే ట్యూషన్‌కు వెళ్లిన తమ పిల్లలు ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. బంధువులు, తెలిసిన వారిని విచారించినా వారి ఆచూకీ తెలియరాలేదు. దీంతో బుధ వారం పోలీసులుకు ఫిర్యాదు చేశా రు. ఎస్సై మగ్బూల్‌బాషా విద్యార్థినుల అదృశ్యంపై కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేపట్టారు. నమోదు చేసిన కొన్ని గంటల్లోనే కేసును ఛేదించారు. ఆ బాలికలు ఆర్టీసీ బస్సులో నల్లచెరువు నుంచి మెలకలచెరువుకు వెళ్లి, అక్కడ నుంచి తెలిసిన మిత్రులతో కలిసి అనంతపురం వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. వారిని నల్లచెరువు పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

ఓబులదేవరచెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవి మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం కేంద్ర ప్రభు త్వ పథకాలపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన క్యార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శివరామప్రసాద్‌రెడ్డి, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ కుంచె రవీంద్ర మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జలసంరక్షణ్, సూర్యఘర్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు, పల్లవి మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, సచివాలయ సిబ్బంది, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

దేశానికి దశ.. దిశ చూపిన కలాం

● జయంతి వేడుకల్లో వక్తలు



అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న కాకతీయ పాఠశాల విద్యార్థులు

ధర్మవరం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): దేశానికి దశదిశ చూపిన మహనీయుడు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం అని కాకతీయ పాఠశాల కరస్పాండెంట్ నిర్మలాదేవి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాశ్‌రెడ్డి, పద్మ కొనియాడారు. అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకుని బుధవారం కాకతీయ పాఠశాల విద్యార్థులు పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోవాలని పట్టణంలోని రిషిపాఠశాల డీన్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కరుణ్ స్వరూప్‌సింగ్ విద్యార్థులకు సూచించారు. అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ని వాళులర్పించారు. విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. పాఠశాల సీఏఓ రవీంద్ర, వైస్ ప్రిన్సిపాల్ కల్యాణి, ఏఓ రంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కదిరి అర్బన్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను బుధవారం పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మోమిన్ సలీం బాషా మాట్లాడులూ తమిళనాడు రాష్ట్రంలో ఒక నిరుపేద కుటుంబంలో జన్మించిన అబ్దుల్ కలాం భారత అణురంగంలో అత్యున్నస్థాయికి చేరి అనేక సేవలు అందించిన గొప్ప శాస్త్రవేత్త అని అన్నారు. అలాగే రాష్ట్రపతిగా దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న రిషీ పాఠశాల డీన్, ప్రిన్సిపాల్

నిబంధనలు తప్పక పాటించాలి

● టపాసుల దుకాణాల ఏర్పాటుపై ఆర్డీఓ సూచన



టపాసుల విక్రయం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ వీవీఎస్ శర్మ

నంబులపూలకుంట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకొని టపాసుల విక్రయం కోసం స్థాని క తహసీల్దార్ కార్యాలయం సమీపంలో స్థలాన్ని ఆర్డీఓ వీవీఎస్ శర్మ బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టపాసుల విక్రయదారులు నీటి వసతి, నీడ ఏర్పాటు తో పాటు అగ్నిమాపక శాఖ సూచనలు పాటించి దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు విన్నవిస్తూ... సోలార్ పార్క్ కోసం భూములు కోల్పోయి ఇప్పటి వరకు కొందరు పరిహారానికి నోచుకోలేదని తెలిపారు. వారికి పరిహారం అందజేయాలని కోరారు. పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఉండి నేటికీ పరిహారానికి నోచుకోలేదని భూములు కోల్పోయిన రైతులు తెలిపారు. జీవనాధారమైన భూములను సోలార్‌కు ఇచ్చామని, త్వరగా పరిహారం ఇప్పించాలని రైతులు కోరారు. ఆర్డీఓతో పాటు తహసీల్దార్ దేవేంద్రనాయక్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు పైపులైన్ల ఆటంకం

● పరిశీలించిన అధికారులు



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తచెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాలుగురోడ్లకు ఇరువైపులా రూ. 2కోట్ల వ్యయంతో రోడ్డువిస్తరణ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు చేపట్టారు. అయితే సత్యసాయి బాబా తాగునీటి పైపులైన్‌ను గతంలో ఆర్‌అండ్‌బీ స్థలంలోనే వేశారు. ఇప్పుడు రోడ్డు విస్తరణ పనులకు ఆ పైపులైన్ ఆటంకంగా మారడంతో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సంజీవయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గంగాధర్, సత్యసాయివాటర్ సప్లై అధికారులు బుధవారం మం డల కేంద్రంలోని ధర్మవరం రహదారిలో పర్యటించారు. పైపులైన్ ను పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ స్థలంలో ఉన్న పైప్‌లైన్‌ను తొలగిం చాలని, లేకపోతే ఎక్కువ లోతులో ఏర్పాటుచేసుకోవాలని ఆర్ డబ్ల్యూఎస్, సత్యసాయి వాటర్ సప్లై అధికారులకు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలియజేశారు. అయితే తాగునీటి పైపులైన్ లోతుగా వేయడం వల్ల ఎప్పుడైనా పైపులైన్ పగిలిపోతే రోడ్డును తవ్వాల్సి వస్తుందని, అప్పుడు రోడ్డు దెబ్బతినే అవకాశం ఉందని ఆర్‌అడబ్ల్యూఎస్, సత్యసాయి వాటర్ సప్లై అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని ఆయన సూచన మేరకు వ్యవహరిస్తామని వారు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాడిమర్రి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ దేశంలో ఓటు చోరీకి పాల్పడుతోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు ఆ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా మండల నాయకులు బుధవారం మండలకేంద్రంలో సంతకాల సేకరణ చేపట్టారు. పార్టీ రాష్ట్ర ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు బ్యాళ్ల కాటమయ్య ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటరెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ పై అవగాహన



పోస్టర్లతో ర్యాలీ చేస్తున్న టీడీపీ నాయకులు


తనకల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని దేవళంతండాలో బుధవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై తెలుగుదేశంల పార్టీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సూపర్ జీఎస్టీ వలన పేద, మధ్య తరగతి ప్రజల కొనుగోలు శక్తి పెరిగినట్లు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవి, గజేంద్రనాయక్, సోంపాలెం నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సాగుభూమికి పట్టాలు ఇవ్వాలని వినతి



ఆర్డీఓ సువర్ణకు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలం లోని ఇనగలూరులో ఉన్న నిరుపేదలకు సాగుభూమి పట్టాలు ఇవ్వాలని బీజేపీ నాయకులు ఆర్డీఓ సువర్ణకు విన్న వించారు. ఈ మేరకు బుధవారం పుట్టపర్తిలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ సువరను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు వీరాంజినేయులు తెలిపారున. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నగలూరు పంచాయతీ గ్రామ పొలం సర్వే నంబరు 261-1లో గాజుగుంటపల్లి వరదరాజుల స్వామి దేవస్థానానికి చెందిన సాగు భూమి అను కూలంగా ఉందన్నారు. ఆ భూమిలో పేదలకు సాగుభూమి పట్టాలు ఇవ్వాలని విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సున్నంపల్లి రంగారెడ్డి, ఆకుతోటపల్లి కృష్ణప్ప, మేకల వెంకటరమణ, బి. కిష్టప్ప, వేమనారాయణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో జేసీ క్యాంపు ఆఫీస్‌కు కేటాయించిన బీఎస్ఎన్ఎల్ భవనం

అద్దె అడగొద్దు..

బీఎస్ఎన్ఎల్ భవనంలో జేసీ క్యాంపు కార్యాలయం

- నెలకు రూ.70 వేలు అద్దె
- పైసా కూడా చెల్లించని దుస్థితి
- రూ.30 లక్షలు బకాయి

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్‌కు ఉమ్మడి జిల్లా యంత్రాంగం పడ్డ బాకీలు ఇప్పట్లో చెల్లించేలా కనిపించడం లేదు. బీఎస్ఎన్ఎల్ లైవ్ టెలీకాస్ట్‌ల బిల్లులు రూ.40 లక్షల వరకూ పెండింగ్‌లో ఉన్నాయి. నేటికీ వాటి ఊసేలేదు. అనంత జిల్లా విభజన సమయంలో కేటాయించిన భవనాల విషయంలోనూ అద్దెల రూపంలో మరో రూ.30 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. 2022లో శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు సమయంలో పుట్టపర్తిలో ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు కేటాయించారు. అదే సమయంలో పుట్టపర్తిలో ఉన్న బీఎస్ఎన్ఎల్ భవనాన్ని ఆ జిల్లా జేసీ క్యాంపు కార్యాలయం, నివాసం కోసం వినియోగించుకునేందుకు అప్పటి కలెక్టర్, జేసీ.. ఆ సంస్థ అధికారులను సంప్రదించారు. ఆ భవనం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నా.. కలెక్టర్, జేసీ స్థాయి అధికారులు అడగడంతో అప్పట్లో అనుమతులిచ్చినట్లు సమాచారం. బిల్డింగ్ రెనోవేషన్ బాధ్యతలు జిల్లా యంత్రాంగమే భరించుకోవాల్సి ఉంటుందని చెప్పినట్లు సమాచారం. ఆ మేరకు రెనోవేషన్ తరువాత సంబంధిత ఇంజనీర్లతో ఎస్టిమేషన్ వేయించి నెలకు రూ.70 వేలు చొప్పున అద్దె చెల్లించేలా ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకూ ఆ అద్దె సొమ్ము రూపాయి కూడా బీఎస్ఎన్ఎల్‌కు చెల్లించలేదని అధికారుల ద్వారా అందిన సమాచారం. పలుమార్లు అద్దె అడిగినా కలెక్టర్, జేసీ, ఆర్డీఓస్థాయి అధికారులు.. పైస్థాయి నిధులు రాలేదని చెప్పుకొస్తుండటంతో నిస్సహాయస్థితిలో బీఎస్ఎన్ఎల్ అధికారులు ఉండిపోయారు. ఈ క్రమంలోనే సంస్థ రాష్ట్ర, కేంద్రస్థాయి అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు బీఎస్ఎన్ఎల్ వర్గాల సమాచారం.

ఇంతవరకూ అద్దె చెల్లించలేదు..



పుట్టపర్తిలో జేసీ క్యాంపు కార్యాలయం, రెసిడెన్సీ భవనం అద్దె చెల్లింపు విషయంలో జిల్లా యంత్రాంగం నుంచి స్పందన లేదు. పలుమార్లు అద్దె బకాయిలు చెల్లించాలని అప్పటి కలెక్టర్, జేసీలను కోరాం. వారి నుంచి స్పందన లేకపోగా... ఫండింగ్ వస్తే ఇస్తామని చెప్పుకొచ్చారు. రూ.30 లక్షల వరకూ అద్దె చెల్లించాల్సి ఉంది. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించాం.

– ముజీబ్‌పాషా, పీజీఎం, బీఎస్ఎన్ఎల్

పునరుత్పత్తిపై దృష్టి సారించాలి

- పశు సంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్



మాట్లాడుతున్న జేడీ ప్రేమ్‌చంద్

అనంతపురం అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువుల పునరుత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రేమ్‌చంద్ ఆదేశించారు బుధవారం స్థానిక డీడీ కార్యాలయంలో డీడీలు రమేష్‌రెడ్డి, నాగలింగేశ్వరరెడ్డి, పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి వెంకటేష్‌తో కలిసి ఏడీలు, వెటర్నరీ డాక్టర్లతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వెటర్నరీ డాక్టర్ తమ పరిధిలోని ఒక మోడల్ గ్రామాన్ని ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేసి, గొడ్డుమోతు పశువులకు చికిత్స అందించడం ద్వారా ఉత్పత్తిని పెంచాలని అన్నారు. పశువుల ఆసుపత్రుల్లో సమయపాలన ఖచ్చితంగా పాటించాలన్నారు. తాను ఆకస్మికంగా తనిఖీలకు వస్తానని, ఎక్కడ పొరపాట్లకు ఆస్కారం ఇచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని అన్నారు. పశుపోషకులకు నిత్యం అందుబాటులో ఉంటూ వ్యాధి నివారణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పాడి పశువులు, మూగ జీవాలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు.

జడ్పీలో సందడి..!

ఉద్యోగోన్నతికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

ఏసీఆర్ సమర్పణకు సీనియర్ అసిస్టెంట్ల క్యూ



ఏసీఆర్ ఇవ్వడానికి వచ్చిన సీనియర్ అసిస్టెంట్లు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం సందడి వాతావరణం కనిపించింది. పలు మండలాల నుంచి సీనియర్ అసిస్టెంట్లు బుధవారం క్యూ కట్టారు. కూటమి ప్రభుత్వం సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బుధవారం డెడ్‌లైన్ పెట్టి సిబ్బందికి సంబంధించిన ఏసీఆర్ (యాన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్) కమిషనర్ కార్యాలయానికి పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో జిల్లాలోని అర్హులైన సీనియర్ అసిస్టెంట్లకు సమాచారం ఇచ్చి ఏసీఆర్ సేకరించడంలో జడ్పీ ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. జడ్పీ కార్యాలయంలోని పరిపాలన విభాగంలో ఏసీఆర్ ఇవ్వడానికి వచ్చిన సీనియర్ అసిస్టెంట్లతో సందడి వాతావరణం కనిపించింది. సంబంధిత గుమస్తాలు, అనంతరం డిప్యూటీ సీఈఓ తనిఖీ చేయించుకొని కమిషనర్ కార్యాలయానికి పంపడానికి చర్యలు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలోని 63 మండలాలకు 63 మంది మండల గ్రామ, వార్డు సచివాలయ అధికారిని నియమించడంలో భాగంగా అర్హత కలిగిన సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించి, అనంతరం ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం. ప్రస్తుతానికి ఉమ్మడి జిల్లాలో డిప్యూటీ ఎంపీడీఓ స్థానాలు ఖాళీ లేవు. ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న స్థానాలకు సంబంధించి ఇప్పటికే అనంతపురం 4, సత్యసాయిలో 11 మందికి సంబంధించి ఉద్యోగోన్నతి ఉత్తర్వులు కమిషనర్ కార్యాలయం నుంచి ఇప్పటికే వచ్చాయి. ప్లేస్‌మెంట్స్ కోసం ఫైల్ కలెక్టర్‌కు పంపారు. అనుమతి వచ్చిన వెంటనే స్థానాలు కేటాయిస్తే.. ప్రతి మండలానికి డిప్యూటీ ఎంపీడీఓలను భర్తీ చేసినట్లు అవుతుంది. మండల గ్రామ, వార్డు సచివాలయ అధికారుల నియామకంలో అదృష్టం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

గల్లంతైన వ్యక్తి మృతి

కనగానపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువలో రెండురోజుల క్రితం గల్లంతైన వ్యక్తి తల్లిమడుగుల గ్రామ సమీపంలో బుధవారం శవమై తేలాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం రూరల్ మండలం కురుగుంట గ్రామానికి చెందిన నాగభూషణం సోమవారం పంపనూరు సమీపాన హంద్రీనీవా కాలువలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. బుధవారం తల్లిమడుగుల కాలువలో శవం తేలాడుతున్న విషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బయటికి తీసి విచారించగా నాగభూషణంగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజారెడ్డి ఎక్కడ?

పట్టుకుని.. వదిలేసిన పోలీసులు..?

యల్లనూరు/పుట్లూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు చేసిన రాజారెడ్డి పోలీసుల అదుపులో ఉన్నాడా..? పరారీలో ఉన్నాడా అనే చర్చ జరుగుతోంది. యల్లనూరు మండలం గొడ్డుమర్రి గ్రామానికి చెందిన రాజారెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని అనంతపురం, నంద్యాల జిల్లాలు, తెలంగాణలో పలువురి నుంచి రూ.2.50 లక్షలు చొప్పున వసూలు చేశాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు యల్లనూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సుమారు రూ.60 కోట్ల వరకూ ఆయన లావాదేవీలు జరిగినట్లు సమాచారం. బాధితులో ఒకరైన హరికృష్ణ ఫిర్యాదు మేరకు రాజారెడ్డిని ఇటీవల అదుపులోకి తీసుకుని విచారించారు. కానీ ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. నిందితుడిని ఇంతవరకూ అరెస్టు చూపకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఓ వైసీపీ నాయకుడి మధ్యవర్తిత్వంతో అతన్ని వదిలేశారనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో బాధితుల నుంచి, ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి రావడంతో పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. పులివెందుల, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో పోలీసులు గాలిస్తున్నారని సమాచారం.

జడ్పీ ఆవరణలో ఉత్కంఠ

ఏసీబీ తనిఖీలతో ఉద్యోగుల్లో ఆందోళన

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): జడ్పీ ఆవరణలోని జిల్లా ఆడిట్ విభాగంలో ఏసీబీ అధికారుల తనిఖీలతో బుధవారం సాయంత్రం తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ తనిఖీలతో జడ్పీలోని సిబ్బంది, అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఆడిట్ విభాగంలో సీనియర్ ఆడిట్ అధికారి లక్ష్మీనారాయణ రూ.8 వేలు లంచం తీసుకుంటూ పట్టు పడ్డారన్న సమాచారం బయటకు పొక్కగానే కార్యాలయంలో సిబ్బంది, అధికారులు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి వెళ్లిపోయారు. జిల్లా కేంద్రంలోని రాజేంద్రమున్సిపల్ హైస్కూల్‌లో సీనియర్ అసిస్టెంటుగా పని చేసే శ్రీనివాసులు ఈ ఏడాది మే 31న ఉద్యోగ విరమణ పొందారు. విధుల్లో ఉండగానే ఆయన ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడినట్లు సమాచారం. ఈక్రమంలో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. సెలవుల బిల్లులు, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందించడానికి ఆడిట్ అధికారులు ముడుపులు అడగడంతో శ్రీనివాసులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో బుధవారం సాయంత్రం ఆడిట్ అధికారి అడిగిన విధంగానే రూ.8 వేలు లంచం ఇస్తుండగా కర్నూలు ఏసీబీ డీఎస్పీ సోమన్న, సీఐలు మోహన్‌కుమార్, హమీద్‌ఖాన్ ఆధ్వర్యంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీంతో జిల్లా పరిషత్ ఆవరణంలోని సిబ్బంది, అధికారులు ఉలిక్కిపడ్డారు. మనకు వచ్చిన తలనొప్పి ఎందుకని కార్యాలయ సమయం పూర్తి కావడంతో ఎవరి దారిన వారు మెల్లిగా వెళ్లిపోయారు.

ఐక్య పోరాటాలే ఐద్వా బలం



ఐద్వా రాష్ట్ర నూతన కమిటీ

(7వ పేజీ తరువాయి)

హరించే పరిస్థితులు నెలకొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్ర కమిటీ ఎన్నిక

ఐద్వా సమావేశాలలో చివరి రోజు రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో 57 మందికి చోటు కల్పించారు. రాష్ట్ర అధ్యక్షురాలిగా శ్రీదేవి, కార్యదర్శిగా సావిత్రి, కోశాధికారిగా శ్రీనివాస కుమారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రమాదేవి, ప్రభావతి ఎన్నికయ్యారు. సీహెచ్ రమణి, వై.సత్యవతి, షేక్ మస్తాన్‌బీ, పూర్ణ, సరోజ, రమాదేవి, సాయిలక్ష్మి, శ్యామల, చంద్రిక కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నికయ్యారు.
రాష్ట్ర కమిటీ సభ్యులు: పి.రమణమ్మ, బి.లక్ష్మి, ఎస్.హైమావతి, ఎస్.కుమార్, ఆర్ఎస్ మాధవి, కొండమ్మ, డి.డి. వరలక్ష్మి, భూలక్ష్మి, డి.ఆదిలక్ష్మి, దైవకృప, ఐ.పద్మావతి, శ్రీదేవి, ఉదయకుమార్, కేతా పద్మజ, శ్యామల, సరోజ, కుమారి, అరుణ, పద్మ, రజని, అనూష, రమాదేవి, షమ్మీ, శివకుమారి, షేక్ మున్వర్, ఈశ్వరి, ముంతాజ్, అలివేలు, అరుణ, పద్మ, శ్యామల, అశ్విని, జ్యోతి, శ్రావణి, అమలశ్రీ, శ్రీదేవిని రాష్ట్ర కమిటీలోకి తీసుకున్నారు. రాజమండ్రి, అన్నమయ్య, కృష్ణా జిల్లాల మహాసభలు నిర్వహించిన తర్వాత, ఆ జిల్లాల సభ్యులను రాష్ట్ర కమిటీలోకి తీసుకుంటారు.

సావిత్రి భావోద్వేగం

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సావిత్రి భావోద్వేగానికి గురయ్యారు. ఐద్వా ద్వారా దశాబ్దాలుగా మహిళల సమస్యలపై చేసిన విస్తృత పోరాటాలను గుర్తించి రాష్ట్ర, జాతీయ ప్రతినిధులు తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారని అన్నారు. సాధారణ కార్యకర్త నుంచి ఇప్పటిదాకా చేసిన పోరాటాలు, ఉద్యమాలను గుర్తు చేసుకుంటూ కంటతడి పెట్టారు.

పది తీర్మానాలు

మూడురోజులపాటు జరిగిన ఐద్వా రాష్ట్ర మహాసభల్లో పది అంశాలపై తీర్మానాలు చేశారు.

- మైక్రో ఫైనాన్స్ సంస్థల దోపిడీ నుంచి కుటుంబాలను కాపాడాలి. ఆ సంస్థలు ప్రభుత్వ నియంత్రణ ఉండాలి, వడ్డీ రేట్లు తగ్గించాలి.
- డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. బ్యాంకు ప్రాసెసింగ్ చార్జీలను గ్రూపు మహిళలకు మినహాయించాలి. డ్వాక్రా సంఘాల్లో అవినీతిని అరికట్టే చర్యలు చేపట్టాలి.
- మహిళలపై సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్‌ను అరికట్టాలి. అందుకు పటిష్టమైన చట్టం చేయాలి.
- ఎన్నికలలో సూపర్ సిక్స్ అమలు చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలి.
- జీఓ నంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలి.
- విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలి. వ్యూహాత్మక అమ్మకం నిర్ణయాన్ని రద్దు చేయాలి.
- మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలి. మద్యం, మత్తు మందులను నియంత్రించాలి.
- నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి. 14 రకాల సరుకులు చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేయాలి.
- హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలి.
- అనంతపురం ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏని పునరుద్ధరించాలి.

హైటెక్ సిటీతో హైదరాబాద్.. గూగుల్‌తో విశాఖ అభివృద్ధి

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

గూగుల్ సంస్థ విశాఖకు రాకపై హర్షం



అనంతపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): హైటెక్ సిటీతో నాడు హైదరాబాద్... గూగుల్‌తో నేడు విశాఖ అభివృద్ధి చెందుతుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దార్శనికతకు ఇదొక నిదర్శనమన్నారు. బుధవారం ఎమ్మెల్యే పరిటాల సునీత తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ తీసుకొచ్చి హైటెక్ సిటీగా రూపకల్పన చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం వైజాగ్‌కు గూగుల్ సంస్థను తీసుకొచ్చి మరోసారి తన ముందుచూపు, దార్శనికతను చాటుకున్నారన్నారు. ప్రతిష్ఠాత్మక సంస్థ గూగుల్ విశాఖలో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. గిగావాట్ సామర్థ్యంతో గూగుల్ సంస్థ విశాఖలో ఏఐ హబ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా రానున్న ఐదేళ్లలో 1.33 లక్షల కోట్ల పెట్టుబడులను పెట్టనుందన్నారు. తద్వారా అమెరికా తరువాత ప్రపంచంలోనే ఆ సంస్థ నిర్మించే అతిపెద్ద ఏఐ హబ్‌గా విశాఖపట్నం యూనిట్ నిలుస్తుందన్నారు. 2 లక్షల మందికి ఉపాధి కల్పించే 1.33 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టే గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావడంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కృషి అభినందనీయమన్నారు. ప్రతి కుటుంబానికి కృత్రిమ మేధ ఫలాలను చేరువ చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన లక్ష్యమన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రం సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ముందుందన్నారు. భావితరాల కోసం వీరు చేస్తున్న కృషి ఎంతో ఉందన్నారు. రానున్న మూడున్నరేళ్లలో రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వస్తాయన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తారని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆశాభావం వ్యక్తం చేశారు.

సీమను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించాలి

కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్



మాట్లాడుతున్న కుంచం వెంకటసుబ్బారెడ్డి

అనంతపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని, లేదంటే కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించాలని రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మద్రాసు రాష్ట్రంలో కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, వేలూరు, కృష్ణగిరి, బళ్ళారి, రాయచూరు, చిత్రదుర్గ కోలార్‌తో కలిపి 12 జిల్లాలతో ప్రత్యేక రాయలసీమ ప్రాంతంగా 1951లో తీర్మానం చేశారని ఆయన గుర్తు చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3ను అనుసరించి 12 జిల్లాలతో కలిపి రాయలసీమను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్లమెంటులో తీర్మానం చేయాలని, ఈ ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవించాలని అన్నారు. ఆ దిశగా రాయలసీమ పాలకులు ప్రధాని మోదీపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కొత్త రాష్ట్ర ఏర్పాటు, ప్రస్తుత రాష్ట్రాలు, ప్రాంతాలలో మార్పులు, చేర్పులు, సరిహద్దులలో మార్పులు, పేర్లలో మార్పులు చేసేందుకు ఎవరికి అధికారం ఉందో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 వివరిస్తుందని అన్నారు. కోస్తాంధ్ర, తెలంగాణ కంటే రాయలసీమ ప్రాంతం చాలా వెనుకబడి ఉందని, రాష్ట్ర విభజన కోసం వేసిన శ్రీకృష్ణ కమిటీ కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసిందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోయాక కొద్దిపాటి మార్పులు, చేర్పులతో పాత ఆంధ్ర రాష్ట్రమే ఆంధ్రప్రదేశ్‌గా మిగిలిందని అన్నారు. రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా లేదా కేంద్రపాలిత ప్రాంతంగా చేసుకోవాలని రాయలసీమవాసులు ఎంతగానో శ్రమించారని అన్నారు. సీమవాసుల కళ్లలో నీరు ఇంకా ఎండలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ అభివృద్ధిని కాంక్షించి, ప్రత్యేక రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతంగా మార్చేలా ప్రధానిపై ఒత్తిడి తేవాలని కోరారు. కర్నూలుకు గురువారం వస్తున్న ప్రధానికి సీమ ప్రజా ప్రతినిధులు వినతిపత్రాలను సమర్పించాలని ఆయన సూచించారు.

గాలిలో ప్రాణాలు..!

టాపుపై ప్రయాణం నిషిద్ధమనీ, అపాయమనీ ఆర్టీసీ బస్సుల్లో ఎక్కడ చూసినా రాసి ఉంటారు. వాటి అమలు మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. బడిపిల్లలు, అదికూడా ఆడుకునే మనస్తత్వం ఉన్నవారు బస్సు టాపుపైకి ఎక్కుతుంటే వద్దని చెప్పేవారు కరువయ్యారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం.. సురక్షితం అని రాసుకునే అధికారులు.. పిల్లల ప్రాణాలను గాలిలో ఉంచుతున్నారు. బొమ్మనహాళ్ మండలంలోని బొల్లనగుడ్డం, కల్లుహోళ్ల గ్రామాల విద్యార్థులు గోవిందవాడ ఉన్నత పాఠశాలకు వెళ్తున్నారు. ఉదయం పాఠశాలకు, సాయంత్రం తిరుగు ప్రయాణంలో బస్సు కిక్కిరిసిపోతోంది. దీంతో విద్యార్థులు టాపుపైనే కూర్చుని వస్తున్నారు. బస్సు టాపుపై ఆడుకుంటూ, కేకలు వేసుకుంటూ, అటు ఇటు తిరుగుతున్నారు. ఏమాత్రం పట్టుతప్పినా ప్రాణాలకే ప్రమాదం. ఆర్టీసీ సిబ్బంది ఇవేవీ పట్టించుకోకుండా టాపు ఎక్కించేస్తున్నారు. అధికారులు మేల్కొని తక్షణమే అదనపు బస్సులు ఏర్పాటు చేసి, టాపు ప్రయాణాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– బొమ్మనహాళ్, ఆంధ్రజ్యోతి



బస్సు టాపుపై ప్రయాణిస్తున్న విద్యార్థులు

పర్యాటక అభివృద్ధికి కృషి చేయాలి


కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాలోని వివిధ పర్యాటక సంరక్షణ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై కలెక్టర్ సంబంధిత శాఖాధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో తాడిపత్రి, ఉరవకొండ, అనంతపురం, కసాపురం, గుత్తి కోట, పెన్నహోబిలం, పెనకచెర్ల, వజ్రకరూరు, గూగూడు, హంపాపురం తదితర పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి స్వచ్ఛంద సేవాసంస్థలు, వ్యక్తులు ముందుకు రావాలన్నారు. చెరువులు, నీటి వనరుల వద్ద బోటింగ్ సౌకర్యం కల్పించడం ద్వారా ప్రజలకు వినోదం, ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. అనంతపురంలో విశాల స్థలంలో ఉన్న శిల్పారామాన్ని అభివృద్ధి చేసి, స్థానిక కళాకారుల ఉత్పత్తులను ప్రదర్శించడానికి, విక్రయించడానికి ప్రత్యేక వేదికగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు, డ్వామా పీడీ సలీంబాషా, శిల్పారామం మేనేజర్ శివారెడ్డి, చరిత్ర ప్రొఫెసర్ సుధాకర్, ఆలిండియా రేడియో ప్రతినిధులు, ఇంటాక్ అధ్యక్షుడు రామ్‌కుమార్, గుత్తి కోట పరిరక్షణ సమితి అధ్యక్షులు విజయభాస్కర్‌చౌదరి, పురావస్తు శాఖ మ్యూజియం అధికారులు పాల్గొన్నారు.

పీఏబీఆర్ @ 5.3 టీఎంసీలు



డ్యాం గేట్ల వద్దకు చేరిన నీరు

కూడేరు, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్)లో నీటి నిల్వ 5 టీఎంసీలు దాటింది. ప్రస్తుతం డ్యాంలో నీటి నిల్వ 5.3 టీఎంసీలకు చేరింది. టర్బైన్‌లో సమస్య తలెత్తడంతో ఆరు రోజులుగా జల విద్యుదుత్పత్తిని ఆపేశారు. దీంతో హెచ్చెల్సీ నీటిని పీఏబీఆర్‌కు రాకుండా నేరుగా ఎంపీఆర్‌కు మళ్లించారు. టర్బైన్ మరమ్మత్తుల అనంతరం రెండ్రోజుల్లో ఉత్పత్తి పునఃప్రారంభించనున్నట్లు జెన్‌కో ఈఈ వెంకటరామ కృష్ణయ్య తెలిపారు. ప్రస్తుతం జీడిపల్లి రిజర్వాయర్ నుంచి మాత్రమే 380 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్‌లోకి వచ్చి చేరుతోంది. జల విద్యుదుత్పత్తి తిరిగి ప్రారంభిస్తే హెచ్చెల్సీ నీటిని పీఏబీఆర్‌కు వదలనున్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 11 టీఎంసీలు కాగా, 5 నుంచి 6 టీఎంసీలలోపే నిల్వ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 443 అడుగులు కాగా, ప్రస్తుతం 435 అడుగులు ఉన్నట్లు వారు తెలిపారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వ 5 టీఎంసీలు దాటడంతో జలకళను సంతరించుకుంది. పర్యాటకుల సందడి పెరిగింది.

విద్యుత్ శాఖ ఉద్యోగుల సమ్మె వాయిదా

అనంతపురం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు ఉద్యోగుల సమ్మె వాయిదా పడింది. మంగళవారం రాత్రి ప్రభుత్వంతో రాష్ట్ర విద్యుత్తు జేఏసీ నాయకులు చర్చలు జరిగినట్లు జిల్లా నేతలు అంటున్నారు. డిమాండ్లపై ఏకాభిప్రాయం కుదరనట్లు తెలుస్తోంది. ప్రధాన మంత్రి కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో రాష్ట్ర నాయకులు సమ్మెను వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఈనెల 17న తిరిగి రాష్ట్ర జేఏసీ నాయకులు.. ప్రభుత్వంతో చర్చలు జరపనున్నట్లు జిల్లా నేతలు తెలిపారు. ఆ మేరకు తదుపరి కార్యాచరణ చేపడతామన్నారు.

రెండో విడతలో 52 మందికి ప్రవేశాలు

అనంతపురం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో రెండో విడత పీజీ అడ్మిషన్లలో మొత్తం 52 మంది ప్రవేశాలు పొందినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మూడురోజులపాటు సాగిన ఈ ప్రక్రియ బుధవారం ముగిసింది.

టమోటా కిలో రూ.20

అనంతపురం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో బుధవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.10, సరసరిగా రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,100 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

నకిలీ మద్యం గుర్తింపునకు ఏపీ ఎక్సైజ్ సురక్ష


యాప్ పనిచేసే విధానాన్ని వివరిస్తున్న ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు

పెనుకొండ టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యాన్ని అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీఎక్సైజ్ సురక్ష యాప్‌ను తీసుకొచ్చిందని సీఐ సృజన్‌బాబు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఈ యాప్ పనిచేసే విధానాన్ని వివరించారు. ఆండ్రాయిడ్ మొబైల్‌లో యాప్ నమోదు చేసుకుని నకిలీమద్యమని అనుమానం వస్తే యాప్ ద్వారా హాలోగ్రామ్ కోడ్‌పై స్కాన్‌చేస్తే బ్రాండ్‌పేరు, సీసా పరిమాణం, బ్యాచ్ ఐడీ, ఎమ్మార్పీ తయారుచేసిన సంస్థపేరు, ఏ డిపోనుంచి రవాణా అయింది ఏ దుకాణానికి చేరింది తదితర వివరాలు క్షుణ్ణంగా తెలుస్తాయన్నారు. దీనినిబట్టి అసలైన మద్యమా లేదా సులభంగా గుర్తించవచ్చన్నారు. అనుమానం వస్తే 14405 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్‌చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. నేటి నుంచి ఈయాప్ అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలన్నారు.

'సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

హిందూపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మద్యం కొనుగోలు చేసేవారు ఎక్సైజ్ సురక్షయాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య సూచించారు. నకిలీ మద్యం అని అనుమానం వస్తే వెంటనే సురక్షయాప్‌ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్‌చేసి తెలుసుకోవాలన్నారు. పట్టణంలోని మద్యం దుకాణాలు, బార్లలో స్యాంపుల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నామన్నారు. ఎవరైనా కల్తీ మద్యం, కల్లు తయారుచేసినట్లయితే పీడియాక్ట్ నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు పృథ్వి, ఫారూక్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యం'

చిలమత్తూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే బాలకృష్ణ లక్ష్యమని పీఏ వీరయ్య పేర్కొన్నారు. బుధవారం చిలమత్తూరు పంచాయతీలో మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక నాయకులు భాస్కర్, గౌరీశంకర్, లక్ష్మీనారాయణయాదవ్, అశ్వర్థప్ప, నందీషప్ప, విశ్వనాథరెడ్డి, చంద్రమోహన్, గౌస్ బాషా, సలీం, నరసప్ప పాల్గొన్నారు.

తెలుగు యువత పట్టణ అధ్యక్షుడిగా భార్గవ్

హిందూపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పట్టణ అనుబంధ సంఘాల కమిటీని బుధవారం ప్రకటించారు. పట్టణ తెలుగు యువత అధ్యక్షుడిగా తలుపుల భార్గవ్, బీసీసెల్ పట్టణాధ్యక్షుడిగా ఎన్‌బికే రాజు, తెలుగు మహిళా అధ్యక్షురాలుగా కౌన్సిలర్ భారతి, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా రవికుమార్, ఎస్టీసెల్ అశ్వర్థప్ప, మైనార్టీసెల్ అన్వర్‌బాషా ఎంపికైనట్లు పట్టణాధ్యక్షుడు వెంకటేశ్ తెలిపారు. వీరిని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అభినందించారు.

నేడు వాహన మేళా

హిందూపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ వాహనాల మేళ గురువారం ఉదయం చర్చిగ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు ఆర్టీఓ కరుణసాగర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. గతనెల 22 నుంచి వాహనాల జీఎస్టీ 28శాతం నుంచి 18 శాతానికి తగ్గించారు. దీంతో అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహన డీలర్లు పాల్గొని ద్విచక్రవాహనాలు, కార్లు, వాణిజ్యవాహనాలు, తాజా మోడళ్ల తక్కువ ధరలో ప్రదర్శిస్తారన్నారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించండి

● రెడ్డి సంఘం నాయకుల వినతి


వినతి పత్రం ఇస్తున్న రెడ్డిసంఘం నాయకులు

గోరంట్ల అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో యోగివేమన విగ్రహ ఏర్పాటుకు కోసం స్థలం కేటాయించాలని రెడ్డి సంఘం నాయకులు గోరంట్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ సరోజ నాగేనాయక్‌ను బుధవారం కోరారు. రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలకు చెందిన రెడ్డి సంఘం నాయకులు మండల కేంద్రమైన గోరంట్లలో యోగివేమన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం స్థల సేకరణకు సర్పంచ్‌ను కలిసి వినతిప్రతాన్ని అందజేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు

మడకశిర టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ ఏరియాలో ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని చైర్మన్ నరసింహరాజు అన్నారు. బుధవారం ప్రపంచ హ్యాండ్‌వాష్‌డే సందర్భంగా పట్టణంలో ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొంటే సీజనల్ వ్యాధులతోపాటు ఇతర సమస్యలు తలెత్తవన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానాలని, తద్వారా పర్యావరణం పరిరక్షించవచ్చన్నారు. ఇదేసందర్భంలో హ్యాండ్‌వాష్ ప్రక్రియను శాస్త్రీయ పద్ధతిలో ఎలా చేయాలో సెక్రెటరీలు పట్టణవాసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిషనర్ జగన్నాథ్, మెప్మా ఆర్పీలు, సీఓ నాగేశ్వరి పాల్గొన్నారు.

'ఆరోగ్యానికి చేతిశుభ్రత చాలా అవసరం'

హిందూపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి చేతిశుభ్రత చాలా అవసరమని మున్సిపల్‌చైర్మన్ రమేష్ అన్నారు. బుధవారం జాతీయ హ్యాండ్ వాష్‌డే పురస్కరించుకుని ఇందిరానగర్‌లో స్వయం సహాయక సంఘాలు, ఆర్పీలు, ఓబీలతో కలిసి చేతి శుభ్రత కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ హ్యాండ్‌వాష్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు గంగులయ్య, గంగరత్నమ్మ, పట్టణ సమైఖ్య అధ్యక్షురాలు విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ రామసుబ్బయ్య

రొద్దం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కే రామసుబ్బయ్య తెలిపారు. బుధవారం మండల పరిధిలోని దొడగట్ట గ్రామంలో రైతులకు జీవన ఎరువులపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జీవన ఎరువులు, జీవ సిలీంద్ర నాశికాలు ఎంతమోతాదులో వేయాలి తదితర వివరాలు రైతులకు వివరించారు. వేరుశనగ, కంది, వరి, ఆముదం, రైజోపీఎం కల్చర్ ఆహారధాన్యాలకు అజటోబాక్టర్ వాడాలన్నారు. భూమిలో కరగని స్థితిలో ఉన్న పాస్పరం ఎరువులు కరగడానికి పాస్పరస్ సాల్యుబైజిన్ బ్యాక్టీరియా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి రాజేష్, కవిత పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

పెనుకొండ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పెనుకొండ తాలూకా యూనిట్ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉదయం పెన్షనర్స్ భవనంలో సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం నూతన కమిటీని ఎన్నికల అధికారులు నాగార్జునశెట్టి, రామప్ప ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఫక్రుద్దీన్, కార్యదర్శిగా సుబ్బయ్య, కోశాధికారిగా పీఎస్ నాగరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శివయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.


నూతన కమిటీ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఎన్నికల అధికారి

రోగులకు అందని వైద్యం

- సమ్మెలో పీహెచ్‌సీ వైద్యులు
- హిందూపురం, మడకశిర నుంచి పీహెచ్‌సీలకు తాత్కాలికంగా వైద్యులు
- విధులకు సరిగా హాజరుకాని వైనం
- ప్రైవేటు క్లినిక్‌లకు రోగుల పరుగులు


డాక్టర్ లేకపోవడంతో వెనుదిరుగుతున్న రోగి

మడకశిర రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): డాక్టర్లులేక రోగులు ఇబ్బందులుపడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెలో ఉన్నారు. దీంతో పట్టణాల్లోని ఆసుపత్రుల నుంచి కొంత మంది డాక్టర్లను తాత్కాలికంగా పీహెచ్‌సీలకు వేశారు. వారు కూడా సక్రమంగా రాకపోవడంతో రోగాలతో పీహెచ్‌సీలకు వచ్చే రోగులు విధిలేని పరిస్థితుల్లో ప్రైవేట్ క్లినిక్‌లకు పరుగులు తీస్తున్నారు.

మండలంలో కల్లుమర్రి, కదిరేపల్లి, గుండమల, నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఈ పీహెచ్‌సీ డాక్టర్లు అందరూ సమ్మెలో ఉన్నారు. దీంతో హిందూపురం, మడకశిర ఏరియా ఆసుపత్రులకు సంబంధించిన వైద్యులను ఇక్కడకు తాత్కాలికంగా విధుల నిమిత్తం పంపారు. వారు సరిగా అందుబాటులో లేకపోవడంతో తాము ఇబ్బందులు పడాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల సమయం కావడంతో ప్రతి పీహెచ్‌సీకి రోజులు 80 నుంచి 120 మంది వరకు రోగులు వస్తున్నారు. అయితే డాక్టర్లు విధుల్లో ఉండకపోవడంతో ఆసుపత్రులకు వెళ్లిన తాము నిరాశతో వెనుదిరగాల్సి వస్తోందని రోగులు అంటున్నారు. దీంతో తాము ప్రైవేటు క్లినిక్‌లను ఆశ్రయించాల్సి వస్తోందని చెబుతున్నారు. దగ్గు, జలుబులాంటి వాటికి స్టాఫ్‌నర్సు, ఫార్మాసిస్టు మాత్రలు ఇచ్చి పంపుతున్నారని చెబుతున్నారు. ఇక్కడి పీహెచ్‌సీల డాక్టర్లు సమ్మెలో ఉన్న నేపథ్యంలో హిందూపురం, మడకశిర నుంచి వస్తున్న డాక్టర్లు సక్రమంగా విధులకు హాజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.



జ్వరంతో వచ్చా

ఒళ్లు నొప్పులు, జ్వరంతో బాధపడుతూ కదిరేపల్లి పీహెచ్‌సీకి వచ్చాను. అయితే డాక్టర్ లేరు. స్టాఫ్‌నర్సు మాత్రలు ఇచ్చారు. సీజనల్ వ్యాధులతో గ్రామాల్లో చాలామంది జ్వరంతో బాధపడుతున్నారు. వారు చికిత్స నిమిత్తం పీహెచ్‌సీలకు వస్తున్నారు. డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో వెనుతిరిగి ప్రైవేటు క్లినిక్‌లకు వెళ్తున్నారు.

- గిరియప్ప, శంకరగల్ గ్రామం

మన్రో తోపు ఆక్రమణదారులకు నోటీసులు


నోటీసులు అందజేస్తున్న అధికారులు

చిలమత్తూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కోడూరు మన్రో తోపులో ప్రభుత్వ భూములని ఆక్రమించుకొని భవనాలను నిర్మించుకున్న పలువురికి పంచాయతీ, రెవెన్యూ అధికారులు కలిసి బుధవారం నోటీసులు అందజేశారు. ఇటీవల రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండటంతో రోడ్డు పక్కన ఉన్న దుకాణాదారులు ఉన్నవి కోల్పోవడంతో వారు కూడా కోదండ రామాలయ ప్రాంగణంలో కబ్జాలకు పాల్పడుతుండటంతో అధికారులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ విషయం ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి స్థానిక ప్రజలు తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించిన వెంటనే ఆక్రమణలు అడ్డుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. మన్రో తోపు ఆక్రమణలపై తీవ్రంగా పరిగణించిన ఎమ్మెల్యే పీఏ వీరయ్య స్వయంగా మన్రో తోపుకి వచ్చి పరిశీలించి నివేదికను ఎమ్మెల్యేకి అందజేసినట్లు సమాచారం. అధికారులతో చర్చించిన తరువాత ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించి ఆక్రమణదారులకు ముందస్తుగా నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి భాస్కర్, రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు అందజేశారు. నోటీసులు అందిన 7 రోజుల్లోగా ఆక్రమణలను తొలగించుకోవాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు ఈ సందర్భంగా వారికి తెలియజేశారు.

అభివృద్ధి దిశగా రాష్ట్రం పరుగులు

టీడీపీ నాయకులు


విలేకరుల సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, నాయకులు

హిందూపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, మున్సిపల్ చైర్మన్ రమేష్, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బేవనహళ్లి ఆనంద్ అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థ అయిన గూగుల్‌టెక్ సంస్థను విశాఖకు తీసుకురావడం ఎంతో శుభపరిణామమన్నారు. చంద్రబాబుపై నమ్మకంతో కంపెనీలు మన రాష్ట్రంవైపు చూస్తున్నాయన్నారు. ప్రపంచ దృష్టిని మన రాష్ట్రం ఆకర్షిస్తోందని కేంద్రం సహకారంతో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకెళ్తుందన్నారు. హిందూపురం ప్రాంతాన్ని పారిశ్రామి కహబ్‌గా చేయడానికి ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కృషి చేస్తున్నారన్నారు. కొద్దిరోజుల్లోనే ఫలితాలు కనిపిస్తాయన్నారు. సమావేశంలో పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, కార్పొరేషన్ డైరెక్టర్లు గంగాధర్, పరిమళ, ఆర్‌ఎంఎస్ షఫీ, నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

నెగ్గిన అవిశ్వాసం

పావగడ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సీకేపురం గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు అరుంధతిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. 12 మంది గ్రామ పంచాయతీ సభ్యులు చేతులెత్తి తమ అరుంధతికి వ్యతిరేకంగా బుధవారం సమావేశంలో ఓటేశారు. పంచాయతీ అభివృద్ధికి అరుంధతి ఏమాత్రం కృషి చేయడంలేదని, అవిశ్వాసాన్ని పెట్టారు. బుధవారం జరిగిన ఈ ప్రక్రియకు పంచాయతీ అధ్యక్షురాలు అరుంధతితోపాటు మరో ఇద్దరు సభ్యులు గైర్హాజరయ్యారు. అవిశ్వాసం నెగ్గడంతో త్వరలో నూతన అధ్యక్ష ఎన్నికకు తేదీని ప్రకటించనున్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఉపాధ్యక్షురాలు రాజమ్మతోపాటు సభ్యులు ప్రభాకర్, వెంకటేశ్, దొడ్డన్న, బొమ్మక్క, రత్నమ్మ, గిరీష్‌కుమార్, మహాలింగప్ప, లక్ష్మమ్మ, సువర్ణ, హేమలత, చంద్రకళ హాజరయ్యారు.

రైతు సేవాకేంద్రాల్లో యూరియా

గుడిబండ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళికెర, కరేకెర, సిసిగిరి, రైతు సేవా కేంద్రాల్లో రైతులకు యూరియా పంపిణీ చేయనున్నట్లు ఏఓ వీరనరేష్ తెలిపారు. యూరియా కావాల్సిన రైతులు రైతు సేవాకేంద్రం వద్దకు వెళ్లి పేర్లను నమోదు చేసుకుని తీసుకెళ్లాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఇద్దరికి గాయాలు

రొళ్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడగార్లగుట్ట గ్రామం వద్ద 544 జాతీయరహదారిపై బుధవారం జరిగినరోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మడకశిరమండలం గోవిందాపురం పంచాయతీ డీ. గొల్లహట్టి గ్రామానికి చెందిన సిద్దప్ప, దేవరాజు అగళికి వెళ్లి వస్తుండగా కొరగార్లగుట్ట వద్దకు రాగానే గొల్లహట్టి గ్రామానికిచెందిన వెంకటప్ప ద్విచక్రవాహనాన్ని కుడివైపునకు తిప్పాడు. దీంతో వెనుక నుంచి వస్తున్న సిద్దప్ప, దేవరాజు వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సిద్దప్ప అక్కడికక్కడే మృతిచెందగా దేవరాజు, వెంకటప్పకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. సిద్దప్ప భార్య సుశీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఏఎస్‌ఐ హిదాయత్ తెలిపారు.

పాముకాటుతో అస్వస్థత

గోరంట్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌనివారిపల్లి సమీపంలో జాతీయరోడ్డు నిర్మాణ పనులు నిర్వహిస్తుండగా అందులో పనిచేస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన బూడేశ్వర్ బుధవారం పాముకాటుకు గురయ్యాడు. సమీపంలో పొలంలోకి వెళ్లిన సమయంలో కుడికాలిపై పాము కాటు వేసింది. అతడిని గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా డాక్టర్ తేజస్విని చికిత్స జరిపారు. మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

అగళి(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనగలూరు గ్రామానికి చెందిన నరసింహరాజును బుధవారం పాముకాటు వేసింది. ఉదయం పొలంలో పనులు చేసుకుంటుండగా పాముకాటేసింది. వెంటనే ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లి చికిత్స చేయించుకుని అనంతరం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

కళాశాలలోకి చొరబడ్డ దుండగుడు

సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ అపహరణ

హిందూపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుడ్డం ప్రాంతంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం తెల్లవారుజామున దుండగుడు ప్రవేశించి సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లాడు. ఉదయం విద్యార్థిలు నిద్రలేచిచూడగా సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ కనపడలేదు. దీంతో వారు సమాచారాన్ని ప్రిన్సిపాల్‌కు చేరవేశారు. బాత్‌రూం కిటికీలు కత్తరించి ఉండటాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు కళాశాలను పరిశీలించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తుచేస్తున్నట్లు వివరించారు.


పోలీసుల అదుపులో హత్యకేసు నిందితుడు

నాలుగు రోజుల క్రితం సంతేబిదునూరులో జరిగిన గౌరీబిదునూరుకు చెందిన యువకుడి హత్యకేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సంతేబిదునూరు పంచాయతీలో ఓ గ్రామానికి చెందిన ముగ్గురు హత్యకేసులో పాల్గొన్నట్లు తెలిసింది. వీరిని అదుపులోకి తీసుకుని విచారించి హత్యకుగురైన పవన్‌కుమార్ ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ఘనంగా మారెమ్మ ఉత్సవాలు

గుడిబండ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెఎన్‌పల్లి గ్రామంలో మారెమ్మ ఉత్సవాలను రెండురోజులపాటు గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి


పెనుకొండలో నివాళులు అర్పిస్తున్న కమిటీ సభ్యులు

పెనుకొండ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి, భారత రత్న ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి కలాం సేవా విద్యాభివృద్ధి సంస్థ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జాఫర్‌వలి, ఫయాజ్, ఆర్టీసీ శ్రీనివాసులు, ఎంఎన్ మూర్తి, పాన్‌బాష, టీడీపీ నాయకులు శ్రీరాములుయాదవ్, త్రివేంద్ర, రమణమ్మ, బీజేపీ నాయకులు రామక్రిష్ణ, రామాంజినేయులు, శ్రీదేవి పాల్గొన్నారు.

గోరంట్ల (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు అబ్దుల్ కలాం జయంతిని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, సోమశేఖర్, తిరుపాల్, నరేష్, టైలర్ రుద్ర పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తనిఖీ


రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా టీకాల అధికారి

సోమందేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి సురేష్‌బాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుపట్టీని, రికార్డులను పరిశీలించారు. అన్ని విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం టీకాల సీతలీకరణ విభాగంలో నిల్వ ఉంచిన వాటి నిర్దేశిత సమయాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ వైద్యాధికారులు సమ్మెలో ఉన్నా కూడా పెండింగ్‌లో ఉన్న సర్వేలు, ఇతర కార్యక్రమాలను కొనసాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ హెల్త్ అధికారి వన్నప్ప, సీనియర్ అసిస్టెంట్ మధుబాబు, పర్యవేక్షకులు రవీంద్ర, ఫార్మసిస్ట్ ప్రభాకర్ రాజు, ఎల్‌టీ మాలతీదేవి, హెల్త్ అసిస్టెంట్ షాజహాన్ పాల్గొన్నారు.

వైసీపీ నిరసనలు హాస్యాస్పదం

సగర కార్పొరేషన్ చైర్మన్ రంగేపల్లి వెంకటరమణ

సోమందేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు కల్తీమద్యంపై నిరసనలు చేపట్టడం హాస్యాస్పదమని సగర కార్పొరేషన్ చైర్మన్ రంగేపల్లి వెంకటరమణ అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు బుద్ధిచెప్పినా వారిలో మార్పు కనిపించడంలేదన్నారు. మద్యం కుంభకోణంలో వైసీపీ నేతలు చిక్కుకుని ఊచలు లెక్కపెడుతున్నారన్నారు. వైసీపీ నాయకులు కల్తీమద్యం గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ వెంకటేశులు, పట్టణ కన్వీనర్ సూరి, జనసేన నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

రెడ్ మార్క్‌లే అవుట్ పరిశీలన



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ హసీనా సుల్తానా

పరిగి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): లే అవుట్ రెడ్‌మార్క్‌లో పడిందని, వెంటనే రెడ్‌మార్క్‌ను తొలగించాలని స్థానికులు తహసీల్దార్ హసీనాసుల్తానాను బుధవారం కోరారు. 2018లో ప్రశాంతినగర్‌లో సర్వేనెంబర్ 209లోని లేఅవుట్ రెడ్‌మార్క్‌లోపడిందని, వెంటనే చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. దీంతో ఆమె లేఅవుట్‌ను పరిశీలించారు. ఉన్నతాధికారులతో చర్చించి రెడ్‌మార్క్ తొలగించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సిద్దేశ్, వీఆర్‌ఓ సుధాకర్‌స్వామి పాల్గొన్నారు.

3 నుంచి పారిశుధ్య కార్మికుల సమ్మె


సమ్మె నోటీసు ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు, పారిశుధ్య కార్మికులు

పెనుకొండ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నవంబరు 3 నుంచి సమ్మెబాట పడుతున్నట్లు ఏఐటీయూసీ నాయకుడు రమేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం నగర పంచాయతీ మేనేజర్ వెంకటరమణకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని రెండేళ్లుగా వివిధ దశలుగా ఆందోళనలు చేపట్టామన్నారు. అయినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఈ నేపథ్యంలో 3 నుంచి విధులు బహిష్కరించి సమ్మె చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, సహాయ కార్యదర్శి రమేష్, డివిజన్ కార్యదర్శి శ్రీరాములు, చేనేత కార్మిక సంఘం నాయకులు చీల నారాయణస్వామి, కార్మిక యూనియన్ నాయకులు కిరణ్, గజేంద్ర, రిక్షా నరసింహులు, బావక్క, నాగమణి, శాంతమ్మ పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి సీఎం కృషి

వక్కలిగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

మడకశిర టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారని వక్కలిగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ లక్ష్మీనారాయణ అన్నారు. విశాఖలో గూగుల్ కౌడ్ డేటా సెంటర్ ఏర్పాటు ఆయన సమర్థత వల్లే సాధ్యపడిందన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గూగుల్ కౌడ్ డేటా సెంటర్ రాష్ట్రానికి రావడంతో సుమారు రెండు లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయన్నారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సైతం ఎంతగానో కృషి చేశారన్నారు. ప్రపంచస్థాయి సంస్థ ఏపీకి రావడం రాష్ట్రానికి శుభపరిణామమన్నారు. మన రాష్ట్రంలోనే ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులు ఉపాధి లేక వలస బాట పట్టారని, జగన్ పూర్తిగా రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారన్నారు. సమావేశంలో నియోజకవర్గ బీసీసెల్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

రొద్దం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సాఫ్టబాల్ పోటీలకు కోగిర ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. రెండు రోజుల క్రితం అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో జరిగిన అండర్-19 సాఫ్టబాల్, బేస్‌బాల్ పోటీల్లో ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 8వ తరగతి చదువుతున్న శంకర్ సాఫ్టబాల్ పోటీలకు, 9వ తరగతి విద్యార్థి హరీష్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ మహేష్ తెలిపారు. ఈనెల గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం హరికిరణ్, ఉపాధ్యాయులు అభినందించారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో టీచర్లు